
# పాపం



జేబులో వున్న డబ్బుల్ని సుబ్బారావు అయిదవ సారి లెఖ్ఖ పెట్టుకున్నాడు. ఉహుఁ! జేబులో వున్న డబ్బులు ఒక్క పైసా కూడా ఎక్కువ అవలేదు. మొదటిసారి ఎన్ని అయితే వున్నాయో, అయిదవసారి కూడా అక్షరాల ఆ ఒక్క రూపాయి డెబ్బయి అయిదు పైసలే వున్నాయి! సుబ్బారావుకి తనమీద తనకే చాలా కోపం వచ్చింది. తనని చూసుకుని తనే తెగ జాలిపడ్డాడు. "చేతకాని గుమస్తా వెధవ! గుమస్తా వెధవాని!" అని కసితీరా తిట్టుకున్నాడు. 'ఆత్మనింద తగదు!' అని మళ్ళీ తనకి తనే సర్ది చెప్పుకున్నాడు. అతనికి కేలండరు మీద మహా కోపం వచ్చింది. లేకపోతే ఫస్టుతారీఖు ఆదివారమవ్వాలా? ఫస్టు ఆదివార మయినందుకు, శనివారమే జీతాలు ఇవ్వకుండా, సోమవారం ఇస్తానన్న ఆఫీసరుమీద ఇంకా కోపం వచ్చింది. చిట్టచివరికి జీతాలివ్వని ఫస్టుతారీఖునాడు పుట్టిన శ్రీమతి మీద మరింత మా పెద్ద కోపం వచ్చేసింది.

కాని, ఏంచేస్తాడు! తన కోపాన్ని ఎవరిమీద చూపిస్తాడు? అర్ధరూపాయి యిచ్చి కొన్న కేలండర్ని చింపేస్తాడా! చింపినా మర్నాడు మళ్ళీ కొనాలికదా! అందుకని ఆ ప్రయత్నం మానేశాడు.

ఆఫీసరు మీద కోపం చూపిస్తే ఉద్యోగం ఊడి పోతుందన్న సంగతి సుబ్బారావుకి బాగా తెల్సు. అందుకని, ఆయన మీదా చూపించలేక పోయాడు.

ఇకపోతే పెళ్ళయి నాలుగు సంవత్సరాలయినా అయివుంటే, తన కోపమంతా తప్పకుండా పెళ్ళాం మీద చూపెట్టేవాడే! కాని, ఎంతయినా ఇంకా పెళ్ళికూతురి సిగ్గు పూర్తిగా విడిచిపెట్టని-భర్త ఇంటిలో అడుగుపెట్టి ఇంకా పట్టుమని నెలరోజులయినా కాని, భార్య సుశీల మీద ఎలా చూపెట్టగలడు?

సుబ్బారావే కాదు, ఏ మగవాడయినా, ఇంట్లో అడుగుపెట్టి నెలరోజులయినా కాని భార్యమీద కోపగించుకోగలడా! నో! ఇంపాసిబుల్!

ఆ రోజు ప్రొద్దుట్నించి జరిగిన సంఘటనలన్నీ గుర్తుకు వచ్చాయి సుబ్బారావుకి. ఆరోజు ఉదయం నిద్రనుంచి లేస్తూనే, కళ్ళు విప్పగానే తలంటుకుని కొత్త చీరతో ప్రత్యక్షమైన సుశీలను చూస్తూనే, 'కొంపతీసి పుట్టినరోజు కాదుకదా' అని మనసులో అనుకుంటూ, పైకి మాత్రం కళ్ళెగరేస్తూ అడిగాడు సుబ్బారావు 'ఏమిటి విశేషం?' అంటూ.

సుశీల కొంచెం సిగ్గుపడి, "ఇవాళ నా పుట్టిన రోజు!" అంది, కాఫీకప్పు అందిస్తూ.

"అరరే! నిన్న చెప్పేవుకాదేం? ఇవాళ ఆదివారం. కొట్లుకూడా వుండవు. నీకేం ప్రెజెంట్ కొనివ్వను? ఎంత పనయిపోయింది!" అంటూ తను గాభరాపడిపోయి, సుశీలని ఉక్కిరిబిక్కిరి చేశాడు సుబ్బారావు.

"సుశీల నిజంగా నిన్న తన పుట్టినరోజు సంగతి చెప్పుంటే నువ్వు ఏం కొనేవాడివోయ్?" అని ప్రశ్నించింది సుబ్బారావు మనస్సు సుబ్బారావుని కీవిగా.

"ఏదో కొనేవాడిని. నీకెందుకు!" అని కసిరేశాడు సుబ్బారావు, తన మనస్సుని.

"నిజం చెప్పు. నీ దగ్గర డబ్బులు లేవుగా? నిన్న సుశీల ఆ సంగతి చెప్పనందుకు, నువ్వు చాలా సంతోషిస్తున్నావు కదూ! చెప్పుంటే ఏదయినా కొనాల్సివచ్చేది!" అని నిలదీసింది అతని మనస్సు మొహమాటం ఏమాత్రం లేకుండా.

"నోర్మూసుకో! వెధవ స్వార్థం నువ్వూనూ!" అని సుబ్బారావు మనస్సు నోరు ముయ్యగలిగాడు గాని, గట్టిగా పైకి అనలేకపోయాడు.

ఈ మానసిక సంఘర్షణ అంతా తెలియని సుశీల, ప్రెజెంట్ కొనలేకపోయినందుకే సుబ్బారావు అలా బాధపడిపోతున్నాడనుకుని, "పోన్లెండి. మీరు మరీ అలా ఫీలవకండి. ఏదయినా కొంటేనే ప్రేమ వున్నట్లు, లేకపోతే లేనట్లునా? అయినా నేను చెప్పనిదే మీకుమట్టుకు ఎలా తెలుస్తుంది?" అంది.

"పెళ్ళయ్యాక వచ్చిన మొట్టమొదటి పుట్టిన రోజు పండుగ. నీకు ఏమీ కొనలేక పోయాను." అన్నాడు బాధగా.

"అబ్బ! మీరు మరీ అంత ఇదవకండి. అంతగా అయితే సాయంకాలం ఏదైనా సినిమా చూద్దాం లెండి. ఏం?" అంది - తన భర్తకి తనమీదగల ప్రేమకి మురిసిపోతూ.

''అలాగా! అయిదింటికల్లా రెడీ అయి పోవాలి'' అన్నాడు సుబ్బారావు సంతోషంగా.

రెండు గంటలకి భోజనం చేసి ''నేనిప్పుడే వస్తా. సినిమాకి-రెడీ అవు'' అని భార్యకి చెప్పి బయటపడ్డ సుబ్బారావు రోడ్డు పట్టేడు. పేవ్ మెంట్‌మీద నిలబడి, అదిగో అప్పుడేనండీ, అయిదవసారి జేబులో వున్న డబ్బుల్ని లెక్క-పెట్టడం! బేక్ పాకెట్, ఫ్రంట్ పాకెట్ అన్ని పాకెట్లలో వున్న చిల్లర ఒక దగ్గిర చేర్చి లెక్క-పెట్టినా, ఒక్క- రూపాయి, డెబ్బయి అయిదు పైసలే వున్నాయి. హైదరాబాదు మహానగరంలో, అందులో పెద్ద థియేటర్లో సినిమా చూసి రావాలంటే అధమం ఒక పది రూపాయలు అయినా జేబులో వుండడం శ్రేయస్కరం. ఎవడయినా తెల్సిన వాడు కనిపించక పోతాడా, అన్న ఆశతో లకిడీకాపూల్ వైపు నడిచాడు సుబ్బారావు.

ఊహు! తెలిసిన మొహం ఒక్కటి కూడా కన్పించలేదు. ''లకడీకాపూల్ దగ్గిరేరా మా యిల్లు. ఒక సందే రా!'' అని ఎప్పుడో ఆహ్వానించిన మూర్తి హటాత్తుగా గుర్తుకొచ్చేడు సుబ్బారావుకి. ఒక అరగంట కష్టపడి మూర్తి యిల్లు ఎలాగైతేనేం-పట్టేడు. కాని ఏం లాభం? ఇంటికి వ్రేళ్ళాడుతున్న పెద్ద తాళం కప్ప వెక్కి-రించింది సుబ్బారావుని. ''అవును! వాడికేం, వెనకాల బాగా ఆస్తిపాస్తులు వున్నవాడు. చక్కగా ఏ గోల్కొండో చెక్కేసి వుంటాడు!'' అని మూర్తిని కసిగా తిట్టుకున్నాడు సుబ్బారావు.

విసుగ్గా వెనక్కి మళ్ళాడు సుబ్బారావు. 'రాజు గాడు కనిపించినా బావుండును' అనుకుంటూ.

అంతలో ఆదేదో సినిమాలో శ్రీకృష్ణుడిలాగ తల్చుకోగానే కనిపించనే కనిపించాడు రాజు స్కూటర్ మీద రంయ్‌మని దూసుకుపోతూ. సుబ్బారావుకి వెంటనే ఎవరెస్ట్ ఎక్కినంత సంతోషం వేసింది. సుబ్బారావును చూస్తూనే స్కూటరాపి పలకరించేడు రాజు. ''ఏంరోయ్! ఆదివారం హాయిగా ఎంజాయ్ చెయ్యక రోడ్లు కొలుస్తున్నావేంరా?'' అంటూ. 'గురూ! ఒక టెన్ వుంటే యియ్యి. అర్జంట్.' అనబోయిన సుబ్బారావు పెదాలు రాజు వెనకాతల కూర్చున్న ముద్దుగుమ్మని చూడంగానే నోరు విప్పబోమని సమ్మె చేసేయి.

ఆ అందాలసుందరిని తన గర్ల్‌ఫ్రెండ్‌గా పరిచయం చేసిన రాజు, స్కూటరు దిగకుండానే ''ఏం గురూ! ఆయిలయిపోయిందేమిటి?'' అన్నాడు చిన్నగా కన్నుకొడుతూ.

డబ్బుకి 'ఆయిల్' అని సుబ్బారావు రాజుల మధ్య కోడ్ భాష. కాని, అంత అందమైన అమ్మాయి ముందు రాజు దగ్గిర్నించి డబ్బు అప్పు అడిగి తీసుకోడానికి నామోషీ వేసింది సుబ్బారావుకి. ఆ అమ్మాయి తనని దరిద్రనారాయణుడి కింద జమ కట్టేస్తుందేమో! తనని అలా అనుకున్నా అనుకోకపోయినా, రాజుగాడిని పెద్ద దానకర్ణుడిగా అనేసుకుంటే! అని అనుమానం వేసింది సుబ్బారావుకి. అమ్మో! అంతకంటే ఘోరం ఇంకేమైనా వుందా!

''ఆయిల్లెకేం, ఫుల్‌గావుంది. ఎక్కడికో వెళ్తున్నట్లున్నావ్. గో ఎండ్ ఎంజాయ్!'' అని చెయ్యి వూపేసేడు రాజుకి.

'బై' అనేసి రయ్‌మని స్కూటరు మీద దూసుకుపోయిన రాజునే చూస్తూ వుండిపోయాడు సుబ్బారావు.

'వెధవ! వెధవాని, ఎంతసేపూ స్కూటరు మీద గర్ల్ ఫ్రెండ్స్‌తో తిరగడమే!' అంటూ కాసేపు రాజు అదృష్టానికి ఈర్ష్య పడ్డాడు సుబ్బారావు.

'తంద్రీ వందలకొలది పంపిస్తుంటే తనూ తిరుగుతాడు!' అనుకుని టయిమ్ చూసుకున్నాడు. పావు తక్కువ ఆరు. అయ్యబాబోయ్! సినిమా టైమ్ అయిపోయిందే! అనుకుంటూ ఇంటికేసి గబగబ అడుగులు వేసేడు. స్పీడుగా నడుస్తున్న సుబ్బారావుకి బ్రహ్మాండమైన అయిడియా వచ్చింది. దాంతో వాచీని ఒక 20 నిముషాలు ముందుకు జరిపేసేడు. హాయిగా, నెమ్మదిగా, హుషారుగా నడవటం మొదలెట్టేడు. వీధి మొదలుదాకా తాపీగా నడిచి అక్కడ్నించి వురుకులు, పరుగులుమీద నడచుకుంటూ ఇంటి కొచ్చేడు సుబ్బారావు.



# సుబ్బారావ్!

—పద్మలత

"సుశీ! సుశీ! రెడీ అయ్యేవా?" అంటూ పిల్చేడు కుర్చీలో కూర్చుని మొహం కర్చీఫ్‌తో అద్దుకుంటూ.

చక్కగా ముస్తాబయిన సుశీల "నేను ఎప్పుడో రెడీ!" అంటూ తాళాలతో సహితం వచ్చింది.

"అయితే పద మరి" అంటూ బయటికి దారి తీసేడు సుబ్బారావు.

తాళం వేస్తూ అప్రయత్నంగా వాచీ చూసినట్లు యధాలాపంగా చూసేడు. "అరరే! ఆరున్నర అయిపోయిందే! పిక్చర్ స్టార్ట్ చేసేస్తారు." అన్నాడు హడావిడిగా. "అయ్యో! ఆరున్నర అయి పోయిందా! మన గోడ గడియారం స్లో కాబోలు. ఇంకా ఆరూ పది నిముషాలే అయింది." అంది నిరుత్సాహంగా.

"బజార్లో ఒక ఫ్రెండ్ తగిలేడు. ఎంత వది లించుకుందామన్నా ఆముదంలాగ వదిలేడు కాదు. పోన్లే స్టార్టయితే అయింది, పద. ఆటోలో పోదాం." అంటూ గబగబ అడుగులు వేసేడు సుబ్బారావు.

'ఛీ! అంత మంచి థియేటర్‌లో సినిమా స్టార్ట య్యేక చూస్తే ఏం బావుంటుందండీ—పిక్చర్ కేవిటి? ఇంకోసారి చూద్దాం లెండి. హాయిగా టేంక్‌బండ్‌కి వెళ్దాం. చల్లగా కూడా వుంటుంది.' అంది సుశీల.

"నీ యిష్టం. పుట్టిన రోజునాడు నువ్వు కోరిన కోర్కె తీర్చలేకపోయాను. అంతా ఆ స్టుపిడ్ మూలానే జరిగింది" అంటూ ఇంకోసారి ఊహా లోకంలోని ఆ ఫ్రెండ్‌ని తిట్టిపోసేడు సుబ్బారావు.

అలా తిడుతున్న భర్తని వారిస్తూ, 'పోన్లెండి మీరు ఫీలవుతారని అన్నానుగాని, నా కసలు ఇవాళ పిక్చర్‌కు వెళ్ళాలనే లేదు. టేంక్‌బండ్ మీద చల్లగాలి పీలుస్తూ హాయిగా కబుర్లు చెప్పు కుందాం. ఏం?' అంది సుశీల సుబ్బారావు చేతిని పట్టుకుని నడుస్తూ.

వచ్చేటప్పుడు రిక్షాకి, వేరుశనగ పప్పులకి కూడా తన జేబులో వున్న రూపాయి ముప్పావలా సరిపోతుందని తేల్చుకున్న సుబ్బారావు హాయిగా వూపిరి పీల్చుకున్నాడు.

అమాయకంగా ఏవేవో కబుర్లు చెప్పేస్తున్న సుశీలని చూసి 'ఇంత అమాయకురాల్ని మోసం చేసేనా!' అని సుబ్బారావు మనస్సు కలుక్కు మంది.



# అందమయిన ఫ్లవర్ వాజ్

డ్రాయింగ్ రూం అలంకరించుకోవటానికి కొని తెచ్చిన వస్తువులకంటే మనం చేత్తో చేసుకొన్న వస్తువులు ఉంచితే అందానికి అందమూ ఆనం దానికి ఆనందమూ, తృప్తీ లభిస్తాయి. అంతేగాక, తక్కువ ఖరీదులో చేసుకోవచ్చును గూడా. స్వయంగా తక్కువ ఖరీదులో చేసుకోగల మరో అందమైన ఫ్లవర్‌వాజ్ గురించి ఇప్పుడు చెబుతున్నాను. వీటికి కావలసిందల్లా ఒక ప్లాస్టిక్ వైర్ కట్ట (బుట్టలల్లుకునే ప్లాస్టిక్‌వైర్) ఒక ఇనుపకడ్డీ. ఈ కడ్డీని క్రింద నిలుచో టానికి వీలుగా గుండ్రంగాను మీదికి దాన్ని అంటు కుని పైకి వచ్చే ఒక కాడ ఉండేటట్లుగా ఏ వెల్డింగ్ షాప్‌లోనయినా అయిదారు నిమిషాల్లో తయారు చేసి యిస్తారు. చేయటానికి అర్ధరూపాయి లేదా మహా అయితే రూపాయికంటే ఎక్కువ తీసుకోరు. నాలుగయిదు ప్లాస్టిక్ పువ్వులు – మన అభిరుచినిబట్టి పెద్దవో చిన్నవో తీసుకోవచ్చు. పెద్ద పువ్వులయితే అందంగా ఉంటాయి.

తయారుచేసే పద్ధతి :

ప్లాస్టిక్ వైర్‌ను, ఆరు అంగుళాల పొడవు ఉండేటట్లుగా 22 ముక్కలు కత్తిరించుకోవాలి. మనం ఎన్ని పూవులు ఉంటే బావుంటాయను కుంటామో అన్ని 22 ముక్కలు (ఒక్కొ పూవుకు 22 ముక్కలు కావాలన్న మాట) కత్తిరించుకొని ఉంచుకోవాలి. ముక్కలు కత్తిరించుకోడం అయ్యాక వైర్‌ని తీసుకుని రాడ్ పై భాగాన రాడ్ కనిపించ కుండా చుట్టేయాలి. అలా ఒకటిన్నర అంగుళం చుట్టాక ఒక పూవును ఉంచి ఈ కత్తిరించుకున్న 22 ముక్కలనీ పూవు చుట్టూ తిప్పి ఉంచుతూ, పైన చుట్టుతూ వచ్చిన వైరుతో గట్టిగా చుట్టేయాలి. అలా చుట్టిన పూవు కింది భాగాన ఒకటిన్నర అంగుళం తిరిగి రాడ్‌కి వైరుని చుట్టేయాలి. తరువాత మళ్ళీ యింకో పూవుని తీసుకుని పైన చెప్పిన తీరు లోనే 22 ప్లాస్టిక్ వైరు ముక్కల్ని పూవు చుట్టూ ఉంచుతూ వైర్‌తో గట్టిగా చుట్టేయాలి. ఇలాగే నాలుగు పూవులు చుట్టేయటం పూర్తి అయ్యాక రాడ్ కింది భాగం వరకు పైనుంచీ చుట్టుకుంటూ వచ్చిన వైర్‌తో రాడ్ కనిపించకుండా గట్టిగా చుట్టేయాలి. రాడ్‌కి వైర్ చుట్టటం పూర్తి అయ్యాక వైర్‌ని కట్ చేసి కాస్త వేడిచేస్తే అతుక్కుపోతుంది. ఇప్పుడు వాజ్ పూర్తి అయింది.

ఇలా ఒక కట్టను పొదుపుగా వాడితే రెండు వాజ్‌లు గూడా చేసుకోవచ్చు. వీటిని డ్రాయింగ్ రూమ్‌లోని మూలలలో ఉంచితే ఎంతో అందంగా ఉంటాయి.

—జోస్యము వసుధ